సాక్షి
సిద్దిపేట
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



సెల్‌ఫోన్ పోయిందా?

ఒకప్పుడు పోయిన స్మార్ట్ ఫోన్‌ను రికవరీ చేయడం కష్టంగా ఉండేది. నూతన సాంకేతికత ఆధారంగా సెల్‌ఫోన్ బ్లాక్, ట్రేస్ చేయడం ఇప్పుడు అత్యంత సులువుగా మారింది. 8లో

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్


సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఈ నెల 27వ తేదీ ఉదయం 6గంటల వరకూ ఈ నిబంధన అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ సమయంలో అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదన్నారు. అదేవిధంగా సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.



సీపీఆర్ శిక్షణ తీసుకోవాలి

8లో

ప్రతీ ఒక్కరు సీపీఆర్ శిక్షణ తీసుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ అన్నా రు. సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో వైద్యులు సత్యప్రకాశ్, రాజశేఖర్, రాహుల్, వినోద్‌లు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.



న్యూస్‌రీల్

మే 15 వరకు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో చేపట్టిన ‘మన ఊరు–మన బడి’ పనులను మే నెల 15లోపు పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మన బడి పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన బడి పనుల్లో భాగంగా ఎలక్ట్రిసిటీ, తాగునీరు, మేజర్, మైనర్ రిపేర్లు త్వరగా పూర్తి చేసి కలరింగ్ వేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈజీఎస్ కింద ప్రహరీ, అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్, ఇతరత్రా పనులు పూర్తి చేయాలన్నారు. టెండర్ పనుల ప్రారంభం నుంచి ముగింపు వరకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కొండపాక మండల పరిధిలోని పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నందున అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో సేవింగ్స్ వస్తే సుందరీకరణ పనుల్లో భాగంగా మెట్లకు గ్రానైట్, స్టేజీ ఏర్పాటు, గ్రీన్ కార్పెట్, బెల్, మౌత్, గేట్‌పై ఆర్చ్, ఇలా ఆయా పనులు చేసుకోవాలన్నారు. సుందరీకరణ బాధ్యత మండల ఎంఈఓలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడూ పనులు పూర్తి చేస్తూ కలరింగ్ మెథర్‌మెంట్ షీట్‌ను అందించాలన్నారు. వచ్చే సమావేశంలోపు పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్‌రెడ్డి, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2022–23 విద్యాసంవత్సరం చివరి పనిదినం ఏప్రిల్ 24న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు పాఠశాల హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఏ సబ్జెక్ట్‌లో విద్యార్థులు చురుకుగా ఉన్నారు, ఏ సబ్జెక్ట్‌లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తెలపాలన్నారు. వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రోగ్రెస్ రికార్డును విద్యార్థుల తల్లిదండ్రులకు అందించాలన్నారు. విషయాన్ని ముందుగానే విద్యార్థుల తల్లిదండ్రులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు.

దివ్యాంగురాలికి బ్యాటరీ సైకిల్



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు దబ్బెట కనుకలక్ష్మికి మంత్రి హరీశ్ రావు సహకారంతో బుధవారం ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ బ్యాటరీతో నడిచే సైకిల్ అందజేశారు. స్థానిక సర్పంచ్ కుక్కల పావని దివ్యాంగురాలి దీనస్థితిని రవీందర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మంత్రి హరీశ్‌రావుకు వివరించారు. స్పందించిన మంత్రి వెంటనే బ్యాటరీతో నడిచే సైకిల్‌ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మోటార్ సైకిళ్ల అందజేయడంతోపాటు ప్రతీ నెల రూ. 3 వేలు పెన్షన్ మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన మాదాసు శ్రీనివాస్, సర్పంచ్ పావని, వార్డు సభ్యులు నవీన్, నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

మాకో డివిజన్ కావాలి

గ్రామపంచాయతీ..
మండలం..రెవెన్యూ డివిజన్..

- చేర్యాల, దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోరుతున్న ప్రజలు
- తిగుల్ మండలం ఏర్పాటు చేయాలని 262 రోజులుగా నిరాహార దీక్షలు
- పలుచోట్ల గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు
- జిల్లాలో ఇప్పటికే మూడు ఆర్డీఓలు, 26 మండలాలు, 499 పంచాయతీలు

ప్రభుత్వ పాలన మరింత చేరువకావాలని రెవెన్యూ డివిజన్లు, మండలం, ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లు, 26 మండలాలు, 499 గ్రామ పంచాయతీలు ప్రస్తుతం ఉన్నాయి. జిల్లాలో పలుచోట్ల రెవెన్యూ డివిజన్‌లు, మండలం, ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని స్థానికులు ఉద్యమిస్తున్నారు. రిలే నిరాహార దీక్షలు, వంటవార్పు, ప్రజా ప్రతినిధులకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేస్తున్నారు.

– సాక్షి, సిద్దిపేట



చేర్యాల పట్టణం వ్యూ

చేర్యాల, దుబ్బాక రెవెన్యూ డివిజన్‌లు కావాలని...

చేర్యాల, దుబ్బాకలు రెవెన్యూ డివిజన్‌లుగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దుల్మిట్ట మండలాలతో చేర్యాల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటు సమయంలోనే దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తారని ఆశించినప్పటికిని నిరాశ మిగిలింది. గత ఆరు సంవత్సరాలుగా దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. దుబ్బాక, అక్బర్‌పేట–భూంపల్లి, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోలు మండలాలతో దుబ్బాక రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఊపందుకుంది.



గ్రామ పంచాయతీగా మార్చాలని దీక్ష చేస్తున్న పందిళ్ల స్టేజీ వాసులు(ఫైల్)

తిగుల్ మండలం కోసం నిరవధిక దీక్షలు

తిగుల్ మండలం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గత 262 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. జగదేవపూర్ మండలం నుంచి తిగుల్, తిమ్మాపూర్, అనంతసాగర్, అంతాయిగూడ, బిజి వెంకటాపూర్, అలిరాజ్ పేట, నిర్మల్‌నగర్, బస్వాపూర్, మర్కూక్ మండలం నుంచి అంగడి కిష్టాపూర్, గణేశ్‌పల్లి గ్రామాలతో కలపి తిగుల్ మండలం ఏర్పాటు చేయాలంటున్నారు. నిరాహార దీక్షలు 200 రోజుల నాడు ప్రగతి భవన్, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, దయాకర్ రావు లకు 200 పోస్ట్ కార్డులు రాసి పంపారు. 100 రోజుల నాడు తిగుల్ నుంచి కొండపోచమ్మ వరకు 16 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు.



పంచాయతీలు ఏర్పాటు చేయాలని ..

అక్కన్నపేట మండలంలోని కుందనవానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చౌటకుంట తండా, సీతారాం తండా, బోరింగ్ తండా, దేవా నాయక్ తండా లను కలుపుతూ చౌటకుంట తండాను గ్రామ పంచాయతీగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సుమారుగా 561 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సరిరాం తండా, డాక్య ,మంజ్యా నాయక్ తండా, దెక్య నాయక్ తండా లను కలుపుతూ సరిరాం తండాను జీపీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు పంచరాయి తండా, అంబనాయ తండా,ఏనియా నాయక్ తండాలను కలుపుతూ పంచరాయి తండాను జీపీగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చౌడు తండా, బోధర్ వాగు తండా, మంజ్యానాయక్ తండాలను కలుపుతూ చౌడు తండాను జీపీగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

➡ హుస్నాబాద్ మండల పరిధిలోని పందిళ్ల స్టేజీ శివారు పల్లె మీద 1150 ఓటర్లు ఉన్నారు. ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని మార్చి 1 నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నారు. దీని పై ఎమ్మెల్యే సతీశ్ కుమార్ ను కలిసి విజ్ఞప్తి చేయగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో శాంతి యుతంగా దీక్షలు చేస్తున్నారు.

ప్రజల ఆకాంక్షను గుర్తించాలి...



ప్రజల ఆకాంక్షను గుర్తించి తిగుల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి. మంత్రి హరీశ్ రావుకు వినతి పత్రంను అందజేశాం. గత 262 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నాం. 10 గ్రామాలతో తిగుల్ కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి. మండలం ఏర్పాటయ్యేంత వరకు దీక్షలు కొనసాగిస్తాం. సీఎం కేసీఆర్, మంత్రులకు పోస్టుకార్డులను రాశాం.

– భానుప్రకాశ్ రావు, సర్పంచ్, తిగుల్

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ముస్లింలకు రంజాన్ తోఫాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు అభివృద్ధిని అధ్యయనం చేయడానికి ఇక్కడికి రావడమే ఇందుకు నిదర్శమన్నారు. రంజాన్ పండుగకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మైనారీల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లింలకు శుభాలు కలగాలని ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, తహసీల్దార్ బాల్‌రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్యూటీలో అలర్ట్‌గా ఉండాలి



ఇండోర్ స్టేడియంలో పోటీలను ప్రారంభిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: పోలీసు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చినపుడు పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి ఐదు నుంచి పది నిమిషాల్లో చేరుకోవాలని ఆదేశించారు. సెక్యూరిటీ ప్లాన్, కమ్యూనికేషన్ వ్యవస్థపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. బ్లూకోట్స్, పెట్రోకార్, రాత్రిపూట విధులు నిర్వహించే పోలీసులు, ఎస్సైలు, సీఐలు, ఏసీపీలు సంఘటన స్థలానికి ఎలా చేరుకోవాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీజీపీ కార్యాలయం నుంచి, పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారుల నుంచి, ప్రజల నుంచి కానీ సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూంకు ఏదైనా సమాచారం వస్తే ప్రయార్టీని ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర అధికారులకు తెలియజేయాలన్నారు. ఇతర జిల్లాల బార్డర్ పోలీస్ స్టేషన్ల సిబ్బందితో ఎప్పటికప్పుడు కమ్యునికేషన్ పెంచుకోవాలని సూచించారు. డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా ఎస్సైలు వారి పరిధిలోని గ్రామాలకు వెళ్లడానికి రూట్ మ్యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎవరినైనా అదుపులోకి తీసుకునే ముందు చట్ట ప్రకారం ఎస్‌ఓపీతో అరెస్టు చేయాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, ఏసీపీ కార్యాలయాల్లో రూరల్ పోలీస్ స్టేషన్ మాదిరిగా 5ఎస్ ఇంప్లిమెంటేషన్ పూర్తి చేయాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ సూచించారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామ్ చందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రమేశ్, సతీశ్, ఫణిందర్, రవిందర్‌రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు

ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఆరోగ్యాన్ని మించినది ప్రపంచంలో మరొకటి లేదని, మనిషి ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. మానసిక ఉల్లాసం కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విధి నిర్వహణ, క్రీడలతో పాటు వాకింగ్, యోగా సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పోటీలు వారంరోజుల పాటు జరుగుతాయని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు అందజేస్తామన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆర్ఐ అడ్మిన్ శ్రీధర్‌రెడ్డికి సూచించారు.రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రవికుమార్ లు లైజనింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచందర్‌రావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, టూ టౌన్, త్రీటౌన్ ఏసీపీలు రవికుమార్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ లీడర్ మృతి



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు
- ఆస్పత్రి నుంచి డిస్ చార్జి
- బంధువుల ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ కిందపడి దుర్మరణం

సిద్దిపేటఅర్బన్/తొగుట: బైక్‌పై నుంచి పడి బీఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందాడు. సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్‌లో ఈ ప్రమాదం జరిగింది. తొగుట మండలం కాన్గల్ గ్రామానికి చెందిన మరుపల్లి శ్రీనివాస్ గౌడ్(43) మూడు రోజుల క్రితం బండిపై నుంచి పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం ఆస్పత్రి నుంచి డిస్‌చార్జి అయిన తర్వాత పొన్నాలలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా కిష్టసాగర్ రోడ్డులో స్పృహ తప్పి పడిపోయాడు. వడదెబ్బ తగిలి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాన్గల్‌లో విషాదం

ఉద్యమపాట లతో తెలంగాణ పోరాటానికి ఊపిరి లూదిన గాయకుడు కాన్గల్ శ్రీనివాస్‌గౌడ్ మృతితో విషాదం అలుముకుంది. కాన్గల్ గ్రామానికి చెందిన మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్ టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. 2001లో టీఆర్‌ఎస్‌లో చేరారు. దొమ్మాట ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి మీటింగ్‌ను అడ్డుకొని వార్తల్లోకెక్కారు. వార్డు మెంబర్‌గా, విద్యా కమిటీ చైర్మన్‌గా, ఏఎంసీ డైరెక్టర్‌గా, పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కాగా.. శ్రీనివాస్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

కుకునూరుపల్లిలో రెచ్చిపోయిన కుక్కలు

- 10 మందిపై దాడి.. తీవ్ర గాయాలు
- బాధితుల్లో మూడేళ్ల బాలిక


కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో బుధవారం ఊర కుక్కలు స్వైర విహారం చేశాయి. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పుల్ల కనుకయ్య, సలంతి నర్సింలు, సత్యనారాయణ, పి.శ్రీకాంతి, పుల్ల సుజాత, శిరీష, గంగిశెటి సందవ్వ, శ్రీకృతి, మంద సత్తయ్య సహా.. ముద్దాపూర్ గ్రామంలో మూడేళ్ల చిన్నారి కృతికపై కూడా కుక్కలు దాడి చేశాయి. దీంతో బాధితులకు మొహం, నోరు. కంటి రెప్పలు, మోకాలు, తల భాగంపై గాయాలయ్యాయి. వీరిలో కొందరిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి, మరి కొందరిని శస్త్రచికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మాంసం విక్రయ కేంద్రాలు, వైన్స్ దుకాణాల వద్ద విచ్చలవిడిగా తినుబండారాలు పడేస్తున్నారు. దీంతో వాటిని తినడానికి అలవాటు పడిన కుక్కలు.. దారిన వెళ్తున్న వారిపై దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ ఊర కుక్కల బెడద పెరిగిపోతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.



ముద్దాపూర్‌లో కుక్కల దాడిలో గాయపడిన మూడేళ్ల కృతిక

భయం భయంగా చదువులు

- పెచ్చులూడిన పాఠశాల పైకప్పు
- విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- వివరాలు తెలుసుకున్న ‘గడా’ స్పెషల్ ఆఫీసర్ ముత్యంరెడ్డి



వరండాలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

గజ్వేల్‌రూరల్: విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోందని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లి 7వ వార్డు ప్రభుత్వ పాఠశాల పైకప్పు పెచ్చులూడిన ఘటనపై పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంగుపల్లి యూపీఎస్‌లో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు మొత్తం 70 మంది ఉన్నారు. హెచ్‌ఎం రమ, మరో ఇద్దరు టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. 1985లో పాఠశాల కోసం ఓ గది నిర్మించగా, ఆ తర్వాత పక్కనే మరో రెండు గదులు నిర్మించారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో ఏడో తరగతి అప్‌గ్రేడ్ చేశారు. 2004లో అదనంగా మరోగది, 2006లో జీప్లస్‌వన్ పద్ధతిలో మరో భవనాన్ని నిర్మించారు. మొదట్లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో తాత్కాలికంగా అంగన్‌వాడీ సెంటర్ కొనసాగిస్తున్నారు. దీని పక్కనే రెండు గదులతో నిర్మించిన భవనంపై మర్రి చెట్టు పెరగడంతో పెరిగింది. దీంతో అది శిథిలావస్థకు చేరింది. 2017–18 వరకు ఏడో తరగతి వరకు విద్యాబోధన జరుగగా, విద్యార్థుల సంఖ్య తగ్గడంతో 2018–19 విద్యాసంవత్సరం నుంచి ప్రైమరీ క్లాస్‌లే కొనసాగిస్తున్నారు. 2004లో నిర్మించిన గదిని స్కూల్ ఆఫీస్ కోసం వినియోగిస్తున్నారు. గతంలో ఈభవనం వరండా పైకప్పు పెచ్చులూడింది. ఆవరణలో ఉన్న టాయిలెట్స్ శిథిలావస్థకు చేరాయి.

తప్పిన ప్రమాదం...

రోజుమాదిరిగానే స్కూల్ టైమ్ ముగిసిన తర్వాత మంగళవారం టీచర్లు గదులకు తాళం వేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం హెచ్‌ఎం రమ పాఠశాల కార్యాలయ గది తాళం తెరిచి చూడగా పైకప్పు పెచ్చులూడి కిందపడి కనిపించింది. విషయాన్ని ఆమె ఉన్నతాధికారులకు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అక్కడికి చేరుకొని అధికారుల తీరుపై మండిపడ్డారు. భయం గుప్పిట్లో విద్యాబోధన జరుగుతుందని, పెచ్చులూడిన సమయంలో విద్యార్థులుంటే ప్రమాదం జరిగేది ఆగ్రహం వ్యక్తం చేశారు.



పెచ్చులూడిన సంగుపల్లి యూపీఎస్ గది పైకప్పు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం



పాఠశాలను గతంలోనే సందర్శించి శిథిలావస్థకు చేరుకున్న భవననం స్థానంలో మన ఊరు–మన బడి పథకంలో కొత్త భవనం నిర్మించాలని ఆదేశించారు. సర్వశిక్షాభియాన్‌లో భాగంగా 2004లో నిర్మించిన ఈ భవనం 35 ఏళ్లకుపైగా వినియోగంలో ఉండాలి. కానీ.. భవన నిర్మాణ సమయంలో నాణ్యతా లోపం కారణంగానే పైకప్పు పెచ్చులూడినట్లు తెలుస్తుంది. భవన స్థితిగతులను తెలుసుకుకొని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. మరమ్మతు పనులు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు సురక్షిత ప్రదేశంలో బోధించాలని సూచించాం. = ముత్యంరెడ్డి, గడా స్పెషలాఫీసర్

క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యం


శిరీష (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): కుకునూర్ గ్రామానికి చెందిన పిట్టల శిరీష(12) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏనిమిదోతరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం 5గంటల సమయంలో ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు శాంతమ్మ, కిష్టయ్య ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో వారు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఆటోలో నర్సాపూర్ వెళ్లినట్లుగా ఉందన్నారు. తప్పిపోయిన చిన్నారి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని శిరీష కుటుంబ సభ్యులు కోరారు.

ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష

మెదక్ మున్సిపాలిటీ: అదనపు కట్నం కోసం వేధించి ఆత్మహత్య చేసుకునేలా చిత్ర హింసలకు గురిచేసిన భర్త, అత్తమామలకు యేడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం..చిలిపిచెడ్ మండలం బంటు రామకృష్ణయ్య తన చిన్న కూతురు మీనాను 2020వ సంవత్సరం, మార్చి 15న చిట్కుల్‌కు చెందిన బోయిని ప్రశాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ సందర్భంగా 10 తులాల బంగారం, బైక్, రూ.2లక్షల నగదు, పెళ్లి సామగ్రి అందజేశారు. పెళ్లి జరిగిన కొన్ని రోజుల నుంచే మీనాను ఆమె భర్త ప్రశాంత్‌తోపాటు అత్తమామలు పెద్ద రాజయ్య, యాదమ్మ, మరిది ప్రభులు అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేశారు. వేధింపులు తట్టుకోలేక మీనా 2020లో అక్టోబర్ 5న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఈ విషయమై మృతురాలి తండ్రి రామకృష్ణయ్య అప్పట్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం కోర్టులో కేసు విచారణను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద నిందితులైన బోయిని ప్రశాంత్, అతని తల్లి బోయిని యాదమ్మ ఆమె భర్త బోయిని పెద్ద రాజయ్యలకు యేడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

చోరీ కేసులో మరొకరు..

మనోహరాబాద్(తూప్రాన్): చోరీ చేసిన ఘటనలో ఒకరికి జైలు శిక్ష పడింది. బుధవారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...ఆర్మూర్ మండలం పెర్కిట్ గ్రామానికి చెందిన గోడమీది ప్రశాంత్ మనోహరాబాద్ మండల కేంద్రంలో శ్రీనివాస్‌రెడ్డి సెల్‌ఫోన్ షాపులో ఫిబ్రవరిలో చోరీ చేశాడు. ఎస్‌ఐ అతనిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాడు.

చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో మునిగి వృద్ధుడి మృతి

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల గంగారాం (60)అనే వృద్ధుడు గ్రామ శివారులో ఉన్న గుండు చెరువులో మునిగి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం చేపలు పట్టడానికని ఇంటినుంచి వెళ్లిన గంగారాం తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం చెరువులో మృతదేహం తేలిన విషయాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం చేరవేశారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని తీయించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింలు పేర్కొన్నారు.

ఏడేళ్ల బాలుడిపై వీధికుక్క దాడి

మనోహరాబాద్(తూప్రాన్): వీధికుక్కల దాడిలో ఏడేళ్ల బాలుడు గాయపడిన ఘటన మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాదు సుధాకర్, రేణుక దంపతుల పెద్ద కుమారుడు మనీష్(7) బుధవారం సాయంత్రం ఇంటి ఆరుబయట ఆడుకుంటుండగా వీధి కుక్క కరిచింది. తొడ, వెనుక భాగంలో తీవ్ర గాయాలు కావడంతో బాలుడికి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో చికిత్స నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కల స్వైర్యవిహారం అరికట్టడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తిచేశారు.

సెల్‌ఫోన్ పోయిందా?

బ్లాక్ చేయొచ్చు... ట్రేస్ చేయొచ్చు | అందుబాటులోకి వచ్చిన సీఈఐఆర్

సంగారెడ్డి డెస్క్...

ఒకప్పుడు పోయిన స్మార్ట్ ఫోన్‌ను రికవరీ చేయడం చాలా కష్టంగా ఉండేది. ఫిర్యాదు చేస్తే విచారణకే నెలల కొద్దీ సమయం పట్టేది. అయినా సెల్‌ఫోన్ దొరుకుతుందన్న ఆశ ఉండేది కాదు. అందుబాటులోకి వచ్చిన సాంకేతికత ఆధారంగా సెల్‌ఫోన్ బ్లాక్ చేయడం, ట్రేస్ చేయడం ఇప్పుడు అత్యంత సులువుగా మారింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ పేరిట సెంట్రల్ ఎక్విప్‌మెంట్ రిజిస్టర్ (సీఈఐఆర్) అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాక, సీఈఐఆర్‌లో కంప్లైంట్ రిజిస్టర్ చేస్తే ఫోన్ బ్లాక్ చేయడం, ఎవరైనా వాడినా ఎలా ట్రేస్ చేయొచ్చో పోలీస్‌శాఖ తన సిబ్బందికి శిక్షణ ఇస్తోంది. సంగారెడ్డి జిల్లాలో ఎస్పీ రమణకుమార్ జిల్లా సిబ్బందికి సీఈఆర్‌ఐపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తీసుకున్న వారు సైబర్ వారియర్స్‌గా పనిచేస్తారన్నారు. బీహెచ్‌ఈఎల్ పరిధిలో ఓ మహిళ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా, కేవలం పదిరోజుల్లోనే పోలీసులు రికవరీ చేశారంటే ఈ సాంకేతికత ఎంత బాగా ఉపయోగపడుతుందో అర్థం చేసుకోవచ్చు.



Block Stolen/Lost Mobile

ఒకవేళ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే www.ceir.gov.in పోర్టల్‌లో లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే డిస్‌ప్లే పై బ్లాక్ స్టోలెన్/ లాస్ట్ మొబైల్, అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ పేరిట మూడు రంగుల్లో మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఫోన్ పోగొట్టుకున్నవారు ముందుగా బ్లాక్ స్టోలెన్/ లాస్ట్ మొబైల్ అని రెడ్‌కలర్‌లో ఉన్న బాక్స్‌పై క్లిక్ చేయాలి.

డివైస్ ఇన్ఫర్మేషన్

ముందుగా డివైస్ ఇన్ఫర్మేషన్ అంటూ ఓ కాలమ్ కనిపిస్తుంది. అందులో అడిగిన విధంగా, మొబైల్ నంబర్లు ఎంటర్ చేయాలి. కింది కాలమ్‌లో ఐఎంఈఐ-1, ఒకవేళ డ్యుయల్ సిమ్ ఉన్న మొబైల్ అయితే ఐఎంఈఐ-2 తోపాటు పోయిన ఫోన్ ఏ కంపెనీ, ఏ మోడల్‌తో పాటు, ఫోన్ కొనుగోలు బిల్లుకు సంబంధించిన ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఐఎంఈఐ వివరాలు ఫోన్ బాక్స్ పైనా, బిల్‌లోనూ ఉంటాయి. ఈ రెండే కాకుండా మొబైల్ లో *#06# అని డయల్ చేస్తే ఐఎంఈఐ నంబరు ఫోన్‌లో డిస్‌ప్లే అవుతుంది. ఒకవేళ రెండు సిమ్‌లు ఉన్నా రెండు ఐఎంఈఐల నంబర్లూ డిస్‌ప్లే అవుతాయి. ఆ తర్వాత లాస్ట్ ఇన్ఫర్మేషన్ అంటూ మరో కాలమ్ ఉంటుంది. అందులో ఫోన్ పోగొట్టుకున్న ఏరియా, పోయిన తేదీ, జిల్లా, రాష్ట్రం, ఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారో ఆ ఠాణా పేరు, పోలీస్ కంప్లయింట్ నంబరు ఎంటర్ చేసి దానికి సంబంధించిన ఫొటో కూడా అప్‌లోడ్ చేయాలి.

DEPARTMENT OF TELECOMMUNICATIONS
Central Equipment Identity Register (CEIR)

ఓనర్ పర్సనల్ ఇన్ఫర్మేషన్

ఆ తర్వాత మరో కాలమ్ మొబైల్ ఓనర్ పర్సనల్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. అందులోకి వెళ్లి ఫోన్‌ఓనర్ నేమ్, అడ్రస్, ఏదైనా గుర్తింపు (ఆధార్, పాన్, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్) సెలక్ట్ చేసి, దానికి సంబంధించిన ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఆపై దానికి సంబంధించిన నంబరు కూడా ఎంటర్ చేయాలి. ఒకవేళ మెయిల్ ఐడీ ఉంటే ఆ వివరాలూ మెన్షన్ చేయవచ్చు. మొబైల్ నంబరు ఎంటర్ చేసి గెట్ ఓటీపీ రాగానే సబ్మిట్ చేస్తే కంప్లైంట్ రిజిస్టర్ అవుతుంది.

అన్‌బ్లాక్ ఫౌండ్ మొబైల్

Un-Block Found Mobile

ఒకవేళ పోగొట్టుకున్న ఫోన్ దొరికినా, పోలీసులు రికవరీ చేసి ఇచ్చినా అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్ లోకి వెళ్లి, గతంలో కంప్లైంట్ చేసిన రిక్వెస్ట్ ఐడీ, ఫోన్ నంబరు ఎంటర్ చేయాలి. కాలమ్‌లో అన్‌బ్లాక్ చేయడానికి గల కారణాలు అడుగుతుంది. రికవర్ బై పోలీస్, ఫౌండ్‌మైసెల్ఫ్, బ్లాక్డ్ బై మిస్టేక్, ఇతర కారణాలు ఏమైనా ఉంటే ఫిల్ చేయాలి. మొబైల్ నంబరు ఎంటర్ చేసి గెట్ ఓటీపీ సబ్మిట్ చేస్తే అన్‌బ్లాక్ అవుతుంది.

చెక్ రిక్వెస్ట్ స్టేటస్

Check Request Status

పోగొట్టుకున్న ఫోన్‌కు సంబంధించిన సమాచారం అప్‌డేట్ ఉంటే తెలుసుకోవాలంటే చెక్ రిక్వెస్ట్ స్టేటస్‌లోకి వెళ్లి రిక్వెస్ట్ ఐడీ ఎంటర్ చేస్తే వివరాలు తెలుస్తాయి.



చాలా హ్యాపీగా ఫీలయ్యాను

నా పేరు నాగదేవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా. బీహెచ్‌ఈఎల్‌లో నివాసముంటా. ఏప్రిల్ 7వ తేదీన నా పుట్టినరోజు. టెంపుల్‌కు వెళ్లాను. అక్కడ నా ఫోన్ మిస్ అయ్యింది. బర్త్‌డే రోజునే ఫోన్ పోవడంతో బాధపడ్డాను. అదే రోజు రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కొలీగ్స్, పోలీసుల సాయంతో సీఈఐఆర్ గురించి తెలుసుకొని ఆ వెబ్‌సైట్‌లోనూ కంప్లైంట్ చేశా. మరునాడు నుంచి నాకు రెగ్యులర్ అప్‌డేట్స్ వస్తున్నాయి. స్టేటస్ కూడా చెక్ చేశాను. 17వ తేదీన రామచంద్రాపురం పోలీసుల నుంచి కాల్ వచ్చింది. ఫోన్ దొరికిందని వారు చెప్పిన సమాచారంతో ఎంతో హ్యాపీగా ఫీలయ్యాను. కేవలం పదిరోజుల్లోనే ఫోన్ ట్రేస్ చేశారు. ఇంత తొందరగా దొరకడానికి సీఈఐఆర్ ఎంతో సాయపడిందో నాకు అనుభవపూర్వకంగా తెలిసింది. ఇది అందరికీ ఉపయోగకరమే.

సెకండ్స్‌లో సెల్ కొంటున్నారా..

సెకండ్ హ్యాండ్‌లో సెల్‌ఫోన్లు కొనేవారు కూడా దానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. వెబ్‌సైట్‌లో నోయువర్ మొబైల్ (కేవైఎం) కు సంబంధించిన సమాచారం ఉంటుంది. అది చోరీ అయినదా , బ్లాక్ లిస్ట్‌లో ఉందా తెలుసుకోవాలంటే... క్యాపిటల్‌లో KYM అని టైప్ చేసి ఆ తర్వాత పదిహేను అంకెల ఐఎంఈఐ టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి. వెంటనే దానికి సంబంధించిన సమాచారం మెసేజ్ రూపంలో వస్తుంది.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని..

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు.


గోపిరెడ్డి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం బైక్ ను ఢీకొట్టిన ఘటనలో పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ రామానాయుడు వివరాల ప్రకారం..సూర్యాపేట జిల్లాకు చెందిన గోపిరెడ్డి(31) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటూ అపర్ణ కన్‌స్ట్రక్షన్‌లో స్టోర్ ఇన్‌చార్జ్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం విధుల్లో భాగంగా సంగారెడ్డి వెళ్లి తిరిగి రాత్రి హైదరాబాద్ వస్తుండగా మార్గ మధ్యలో పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఎస్‌బీఐ యూటర్న్ వద్దకు రాగానే వెనుకాల నుంచి గుర్తుతెలియని వాహనం బైక్ ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గోపిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెదక్ రూరల్‌లో..

మెదక్ రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన హవేళిఘణాపూర్ మండలం ఔరంగాబాద్ తండా శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బుడావత్ వినోద్ కుమార్(31) మంగళవారం రాత్రి మెదక్ నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న వినోద్‌ను స్థానికులు 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి జమ్లా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వినోద్(ఫైల్)

ఆటోల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

లింగంపేట: కొంతకాలంగా ఆటోలను చోరీ చేస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు రికవరీ చేసినట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. చోరీకి పాల్పడిన నలుగురిని బుధవారం రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన సింది సారయ్య, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఎల్లయ్యగూడకు చెందిన మసపాక గణేష్, వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం వాల్‌మిది గ్రామానికి చెందిన బాల్‌గుల శ్యామ్, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట్ మండలం నిద్దాన్‌పల్లికి చెందిన గోగు రాజు స్నేహితులు. వీరు మల్కాజ్‌గిరిలో ఉంటూ ఇతరుల ఆటోను కిరాయికి నడిపేవారు. డబ్బులు సరిపోకపోవడంతో ఆటోలను చోరీ చేసి, నంబర్ ప్లేట్ మార్చి తమ సొంత ఆటోలుగా నడిపేవారు. ఈ క్రమంలో ఈ నెల 9న లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన బాలాగౌడ్ ఆటోను వీరు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారాంగా నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా మరో రెండు ఆటోలను కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్‌ఐ తెలిపారు. నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ కాళేశ్వరం కాల్వ సమీపంలోని వే బ్రిడ్జి రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అటుగా వెళ్లే ప్రయాణికులు బుధవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ కృష్ణమూర్తి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ ఎలాంటి ఆధారం లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి గజ్వేల్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. ఎవరైనా సంబంధికులు ఉంటే జగదేవ్‌పూర్ పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా గ్రామ శివారు 65వ జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని బుదేరా ఎస్‌ఐ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. శవం కుళ్లి పోయి ఉందని, (40-45) సంవత్సరాల మధ్య వయస్సు ఉండొచ్చని, బ్లాక్ కలర్ ప్యాంటు, తెలుపు రంగు గీతల చినిగిన అంగి, చేయికి నలుపు రంగు పూసల దారం ఉందన్నారు. సంబంధికులు ఎవరైనా ఉంటే పూర్తి వివరాల కోసం బుదేరా పోలీస్ స్టేషన్ 8712656749, 8977649139 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

బూరుగడ్డలో వివాహిత ఆత్మహత్య


అనిత(ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొడిపల్లి మండలంలోని బూరుగడ్డలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల నాగయ్య, నాగమ్మ దంపతుల కూతురు అనిత(32) పదిహేనేళ్లక్రితం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నర్సింలుతో వివాహం జరిగింది. కాగా భర్త చనిపోవడంతో మరో వ్యక్తితో రెండో పెళ్లి చేశారు. కొన్నాళ్ల క్రితం రెండో భర్త ఆమెను వదిలేశాడు. దీంతో ఆమె తల్లిగారి ఇంటివద్ద ఉంటుంది. కుటుంబ సభ్యులు ప్రస్తుతం హైదరాబాద్ చింతల్ వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా అనిత తన కూతురు ప్రణితతో కలిసి మంగళవారం సాయంత్రం బూరుగడ్డ గ్రామానికి వచ్చింది. అక్కడ మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామానికి వెళ్తున్నట్లు తండ్రి నాగయ్యతో చెప్పింది. సాయంత్రం ప్రణితను తిరిగి చింతల్‌కు బస్‌లో పంపించింది. అనంతరం ఆమె ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనిత మృతికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన గొల్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నర్సింహచారి కోళ్ల ఫారాలకు షెడ్డులను నిర్మిస్తుంటాడు. కుటుంబ కలహాలు, ఇంకోవైపు పెద్దకుమారుడి మృతి మర్చిపోలేక ఆవేదన పడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై బ్లేడుతో గొంతు కోసుకొని పురుగుల మందు సేవించాడు. కుటుంబీకులు, సర్పంచ్ ఎల్లారెడ్డి అపస్మారక స్థితిలో ఉన్న అతణ్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దొంగకు దేహశుద్ధి

సిద్దిపేటకమాన్: దొంగతనం చేసిన ఇనుప వస్తువులను విక్రయించడానికి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలానికి చెందిన ఓ వ్యక్తి భవననిర్మాణాలు జరిగే ప్రాంతాల దగ్గర మిగిలి ఉన్న ఇనుప ముక్కలు, నిర్మాణాలకు వినియోగించే ఇనుమును దొంగిలించాడు. మరో ఇద్దరితో కలిసి సిద్దిపేట పట్టణంలోని ఓ స్క్రాప్ దుకాణంలో ఆ ఇనుమును విక్రయించడానికి ప్రయత్నించగా స్థానికులు గుర్తించి ఆ వ్యక్తిని పట్టుకుని కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు.

నలుగురికి జరిమానా

మెదక్ మున్సిపాలిటీ: మద్యం మత్తులో మెదక్ ఏరియా ఆస్పత్రిపై దాడిచేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి డ్యూటీ డాక్టర్‌ను దూర్భాషలాడిన నలుగురికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...మెదక్ మండలం కొచ్చెర్వుతండాకు చెందిన మూడవత్ రమేష్, పెంటు, మదన్, గణేష్‌లు మద్యం మత్తులో 2015, సెప్టెంబర్, 9న మెదక్ ఏరియా ఆస్పత్రిపై దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. డ్యూటీ డాక్టర్ చెప్యాల శ్రీనివాస్‌ను అసభ్యకరమైన భాషలో దూర్భాషలాడి చంపుతామని బెదిరించారు. ఈ విషయంపై అప్పట్లో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు బుధవారం కోర్టులో విచారణకు రాగా పరిశీలించిన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రీటా లాల్‌చంద్ నిందితులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల మృతి

సిద్దిపేటరూరల్: రోడ్డుపై నిలిచి ఉన్న టిప్పర్‌ను మరో టిప్పర్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా రహదారిపై వెళ్తున్న గొర్రెలు మృతి చెందిన ఘటన నారాయణరావుపేట శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు బీరయ్య, స్థానికుల వివరాల ప్రకారం...నారాయణరావుపేట గ్రామానికి చెందిన సిద్దాల వీరయ్య రోజుమాదిరి గొర్రెలను అడవుల్లో మేత మేసేందుకు తీసుకుపోతున్నాడు. మేకలు, గొర్రెలు రహదారి దాటుతున్న క్రమంలో ముందుగా వచ్చిన టిప్పర్ గొర్రెల వద్దకు వచ్చి ఆగింది. దీంతో వెనకాల నుంచి వస్తున్న మరో టిప్పర్ డ్రైవర్ వేగంగా వచ్చి ముందున్న టిప్పర్‌ను ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనలో గొర్రెలు కూడా అక్కడికక్కడే మృతి చెందాయి.న్యాయం చేయాలని బాధితుడు బీరయ్య పోలీసులను కోరాడు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



రమేశ్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): కుటుంబ సమస్యలతో మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘట మండల పరిధిలోని దౌలాపూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ కథనం మేరకు గ్రామానికి చెందిన జలగరి రమేశ్(35) కూలీ పనులు చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు. ఇటీవల కుటుంబ సమస్యలు ఎక్కువయ్యాయని దీనికి తోడు అనారోగ్యం వెంటాడడంతో మద్యానికి బానిసయ్యాడు. నిత్యం భార్య శివలక్ష్మితో గొడవ పడుతూ చనిపోతానని బెదిరిస్తుండేవాడు. ఈ నెల17న భార్య పుట్టింటికి వెళ్ళింది. ఒంటరిగా ఉన్న రమేశ్ రాత్రి సమయంలో ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన మహిళలు ఇది గమనించి, సమీపబంధువులకు, భార్యకు సమాచారం అందజేశారు. చికిత్స నిమిత్తం వెంటనే అతణ్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూగజీవాల పరస్పర దాడి

చాపగానీతండాలో ఎద్దు మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్): రెండు మూగజీవాలు పరస్పర దాడిలో ఓ ఎద్దు మృత్యువాత పడింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం చాపగానీతండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుగులోతు బాలోజి అనే రైతు ఎద్దు అదే గ్రామానికి చెందిన భానోతు కిషన్ ఎద్దు పరస్పరం దాడి చేసుకున్నాయి. ఈ ఘటనలో బాలోజి ఎద్దు మృత్యువాత పడిందని బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రైతు బాలోజి తెలిపిన వివరాల ప్రకారం.. ఎప్పటిలాగే తనకున్న వ్యవసాయ క్షేత్రంలో రెండు పశువులను కట్టేశాడు. గతంలో పలుమార్లు తన ఎద్దుపై సదరు రైతు ఎద్దు దాడి చేసిందన్నారు. చుట్టుపక్కలా ఎవరి ఎద్దులు లేవని ఖచ్చితంగా కిషన్ అనే రైతు ఎద్దు దాడిచేయడంతోనే తన ఎద్దు మృతి చెందిందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు తనకు రూ.70వేల నష్టం జరిగిందన్నారు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని రైతు బాలోజీ ఎస్‌ఐ తాంత్ర వివేక్‌ను వేడుకున్నాడు.


దాడిలో మృతి చెందిన ఎద్దు

ప్రతీ ఒక్కరు సీపీఆర్ శిక్షణ తీసుకోవాలి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్


సీపీఆర్ శిక్షణలో పోలీస్ సిబ్బంది, పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు ప్రతీ ఒక్కరు సీపీఆర్ శిక్షణ తీసుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో సిద్ది పేట డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి వైద్యులు సత్యప్రకాశ్, రాజశేఖర్, రాహుల్, వినోద్‌లు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రాక్టికల్‌గా సిబ్బంది చేత సీపీఆర్ చేయించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ మాట్లాడుతూ.. అనుకోకుండా ఎవరికైనా కార్డియో అరెస్ట్ జరిగినపుడు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. సీపీఆర్ ద్వారా వారిని కాపాడొచ్చని తెలిపారు.

శిక్షణ సమయంలో ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. కార్డియో అరెస్ట్‌తో స్పృహ కోల్పోయిన వారి ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ కీలకం అన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగహనా పెంచుకోవాలన్నారు. సీపీఆర్ ప్రక్రియ ఏ రకంగా చేయాలనే విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహనా కల్పించడం కోసం రాష్ట్ర రోడ్ సేఫ్టీ, జీవీకేల సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రధానంగా కరెంట్ షాక్‌కు గురైనపుడు, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో, అకస్మాత్తుగా స్పృహ కోల్పోయిన సమయాల్లో, శ్వాస సమస్యలు వచ్చి గుండె ఆగిపోయిన సందర్భాల్లో సీపీఆర్‌తో వారి ప్రాణాలు కాపాడొచ్చని తెలిపారు.